కుక్కిన పేనుల్లా పడుండండి అని మన్ని భయపెట్టడానికే - మనందర్నీ హడలుకొట్టడానికే బాంబును ప్రేల్పించారు తెలిసిందా?”

“అహోహో ఏమిథీరీ లాగేవే కుర్రదానా? బుర్రుందనిపించావు. కాని నీదంతా యాంటీనేషనల్ ఆలోచనలు. ప్రగతినిరోధకపు టూహలు. నిన్ను దేశబహిష్కారము చేసి లేదా ఏదో కుట్రకేసులో యిరికిస్తేనే కాని జలుబు వదలదు. నోరుమూసుకుని పవిత్ర భారత నారిలా అంట్లు తోముకో - ఆలోచించడము మానెయ్.”

“మానేస్తాను. మానేస్తాను. గుజరాతులో, ఆంధ్రలో, బీహార్‌లో గొడవలు జరిగాక, పెద్ద సమ్మె జరుగుతున్నప్పుడు శ్రీవారు బాంబు పరీక్ష శాంతియుతంగా జరిపించారంటే ప్రజల్ని చెదరగొట్టడానికికాక మరెందుకో తెలుసుకోలేనంత అజ్ఞానులం కాము. సీరియల్స్ చదివినా, సైన్స్ చదవక పోయినా మాకూ ఆలోచన్లు, రీజనింగు, పాలిట్రిక్సూ తెల్సు” అని మా వారి వాదన్ను చిత్తుచేశాను.

తులసికోట దగ్గర పాటలు పాడుకునేవాళ్ళం మాకేం తెలుసు సైన్సు, రాజకీయాలు అని కొట్టిపారెయ్యకండి. అందుకే నేను వీలునామా రాశాను. ఎవరికీ చెప్పకండి. మా వంశంలో ఎవరూ నా పుత్ర పౌత్ర యిత్యాది వారసులెవరూ అణుబాంబులు కాదుగదా దీపావళికి కూడా బాంబులు చెయ్యడానికి వీల్లేదనీ అలా చేస్తే - వారెవ్వరికీ నా తదనంతరమందు ముక్కుపుడక కూడా దక్కదనీ - బాబోయ్ మావారు బాంబును తొక్కి వస్తున్నట్లున్నారు. ప్రజలకు వుపయోగపడే పన్లు చేయలేనివారు మాత్రమే సర్కస్ ఫీట్లను చేసి చూపిస్తారు. సర్కస్ ఫీట్లను చూసి ఆనందిస్తాము కాని, యింట్లో అవన్నీ చేయలేముకదా. తీగమీద నడవకపోతేనేమి, కత్తులు విసరకపోతే నేమి, రింగులో మోటారు సైకిలు తొక్కక పోతేనేమి, కిరసనాయిలు సూటుకి రాసుకుని మంటల్తో బావిలో కురవకపోతే నేను - యిలాటి వాటివల్ల ఎంత ప్రయోజనము వుందో బాంబుల పరీక్షలవల్ల కూడా అంతే, మన్లో మనమాట. నాకుసీమటపాకాయలంటే భయం. మావారికి తాటాకు టపాకాయ కాల్చడం కూడా రాదు. అందుచేత మేము నూరు నయాపైసల అహింసా వాదులం, మంగళంబు శ్రీరామచంద్రా, మంగళంబు గుణ సాంద్రా!

# పలకల వెండిగ్లాసు

వెండిగ్లాసు పోయింది. పోయిందమ్మా పోయింది మా పెళ్ళికి మావాళ్ళు పెట్టిన ఇరవై తులాల వెండి గ్లాసు, వంద తులాల వెండి కంచం పక్కన అది నుంచుంటె, చెరువు గట్టున నుంచున్న రాజకుమారుళ్ళా వుండేది. గ్లాసు నిండాపాలుపోసి ఆ గ్లాసు చేత్తోపుచ్చుకుని గుమ్మంలో నిలబడితే అందులోకి తొంగిచూడాలని చందమామ సరదాపడేవాడు.

అసలా గ్లాసు ఎలా వచ్చిందంటే – పెళ్ళికి కంచం చేయించాలని యింట్లో వున్న చిన్నం చిదరూ వెండంతా పోగేసి కనకరాజుకిచ్చారు. అందులోకి నా చిన్న వెండి కంచం కూడా వెళ్ళిపోయింది. అదంతా పెట్టి రెండు శాల్తీలు చెయ్యమంటే – వీరభద్రుడి పళ్ళెంలాటి వెండి కంచం ఓటిచేసి యిక మరచెంబు రాదు పొమ్మన్నాడు. మరచెంబు లేకపోతే ఎల్లాగయ్యా – మరచెంబు లేకుండా పెళ్లేమిటి – మరచెంబు లేని పెళ్ళి వుంటుందా అని మావాళ్ళంతా ఆశ్చర్యపడిపోయారు. మరచెంబు లేకపోతే పెళ్ళాగిపోతుందా అని కనకరాజు మీసాల వెనుక నుంచి నవ్వి – యింకేమన్నా వెండి వుంటే నా మొహాన పారెయ్యండి అన్నాడు. అప్పుడు యిల్లంతా తిరగేసి బోర్లేసి – విరిగిపోయిన పట్టాలు, పెరిగిపోయిన కాళ్ళ గొలుసులు, నా చిన్ననాటి వుగ్గుగిన్నె, వెండి హరివాణం పంచపాత్ర తీసి యిచ్చారు. అప్పుడు ఆ వీరభద్రప్పళ్ళెం పక్కన నుంచుందుకు వీలుగా ఓ మొండి బండ గ్లాసు చేసి తీసుకొచ్చాడు కనకరాజు. ఆ గ్లాసున్జూసి అంతా నవ్వడమే యింట్లో – కుంతీదేవి భీముడ్ని ఎత్తుకోలేక చేజార్చే సిందట ఓసారి – అప్పుడతను కింద పడగానే నేల మీద గచ్చు బీటలు తీసిందట. అలాంటిది మావారికిచ్చిన వెండిగ్లాసు. మరచెంబుకు తమ్ముళ్ళా వుండవలసిన ఆ వెండిగ్లాసు దానికి అన్నలా వుండేది. పద్యాల ముందు పాటలా వెలిగిపోయేది మామూలు వెండి గ్లాసులు ముందు. దాన్ని ఎలా వాడాలో తెలిసేది కాదు మాకు. మంచి నీళ్ళ వడ్డనకైతే పనికొస్తుంది కాని దాంతో కాఫీ యిస్తే సంసారం గుండమైపోతుందని మా అత్తగారు కంగారుపడేది. ఎప్పుడేనా దాన్ని తీయబోతే పెట్లోంచి వుంచమ్మా వుంచు యిప్పుడు దాన్ని తీయకు పైకి, దాన్తో పనేవిటి అని మా అత్తగారు అనేది కాని తీసి వాడనిచ్చేది కాదు. ఏ సత్యనారాయణ వ్రతానికో వినాయకచవితికో దాన్ని తీసి గంధాక్షతలతో అలంకరించి కలశంగా వాడేవాళ్ళం. శ్రావణ మాసంలో సావిత్రి గౌరిదేవి నోము నోచినప్పుడు, వరలక్ష్మీ వ్రతానికి గ్లాసు బాగా పనికివచ్చేది. కొబ్బరికాయకు మైదా పిండితో ముక్కూ చెవులూ దిద్ది అమ్మవారిలా అలంకరణ చేసేందుకు ఆ గ్లాసుని వాడేవాళ్ళం. ఉత్తప్పుడు పటిక బెల్లం ఎండు ద్రాక్ష అందులో వేసేవాళ్ళం. మరొకప్పుడు గొలుసులు, పూసలు, పట్టాలు, రింగులు, వుంగరాలు, ముక్కుపుడకలు, దుద్దులు అందులో వేసేవాళ్ళం. ఒక్కోకప్పుడు పది రూపాయిల నోట్లు, ఐదులు, రెళ్ళూ అందులో దాచుకునేవాళ్ళం కూడా – అలాటి వెండిగ్లాసు పోయింది.

ఆ రోజుల్లో “కొంగట్టుకెక్కాలి కొండమెట్లన్నీను” అన్నట్లుగా సింహాచలం వెళ్ళేవాళ్ళం. ఆ మెట్లన్నీ ఎగురుకుంటూ ఎక్కేసేవాళ్ళం. ఇటు వెన్నెల అటు వెన్నెల అన్నట్లుగా ఒక వైపు పచ్చని తోటలూ చెట్లూ సెలయేళ్ళూ రెండో వైపు కూడా అవే – అరటి దొప్పల్లో కట్టిన సింహాచలం సంపంగి పూలు ఎంత గుమగుమలాడేవి? కొండ మీద అనాస తోటల్ని చూస్తే ఆశ్చర్యం వేసేది. పండు ఆరణాలే. గుడి ముందు బజార్లో చందనపు బొమ్మలు కొనుక్కున్నట్లు గుర్తు. కొండ మీదకు వెళ్తున్నప్పుడు సరిగంగ తానాలు కూడా చేశాం. అప్పుడు విశాఖపట్నంలో సిటీబస్సులు కూడా లేవు. ఓసారి స్టేషన్నించి యింటికి అర్ధరూపాయిచ్చి పెట్టెబండి ఎక్కి

వెళ్ళాం. పెట్టె బండిలో కూర్చుంటే ఎదురెదురుగా పల్లకీలో కూర్చున్నట్లు అనిపిస్తుంది. తలొంచుకోకపోయినా, పెట్టెబండిని మిట్టపల్లాల్లో లాగే ఎద్దుకు మేత కూడా బండి కింద జోలెలో వేసేవారు. మేం సినిమాకెళ్ళినప్పుడు జటకా బండిలో వెళ్ళి వచ్చే వాళ్ళం. జటకా గుర్రాలకి పచ్చిగడ్డి, పెట్టెబండి ఎద్దులకి ఎండుగడ్డి ఎందుకేస్తారా అని ఆశ్చర్యపోయేదాన్ని. బజార్నిండా చెక్కబళ్ళమీద పనస తొనలు కుప్పలుపోసి అమ్మేవారు. పనస తొనలు ఎన్ని తిన్నా యింకా తినాలనిపించేది.

మేం విశాఖపట్నంలో వున్న ఆ రోజుల్లో మాకు ఓవేపు సూర్యుడు, ఓ వేపు చంద్రుడు, పైన ఆకాశం, క్రింద భూమీ, సముద్రము అంతా మనకోసమే వున్నట్లు అనిపించేవి. ఇంట్లో గొడవలన్నీ పెద్దాళ్ళు చూసుకునేవారు. అప్పుడు నా దగ్గిరే ఎప్పుడన్నా అయిదో పదో వుంటే మా వారికి అప్పిస్తూండేదాన్ని. ఆయనకేమీ సంపాదనలేదు – అంచేత మేము సముద్రపొద్దుకెళ్ళి చాలా సేపు కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ ఇంటికి నడిచివచ్చేవాళ్ళం.

అసలప్పుడు చూసినవన్నీ కొనిపించు కోవాలని వుండేది. మంచి మంచి చీరల్ని షాపుల్లో చూసినపుడు అవి బావున్నాయనుకుని, మెచ్చుకుని తరువాత కొనుక్కోవాలి అనుకునే వాళ్ళం. మంచి కుర్చీలు, సోఫాలు, బీరువాలు, డ్రెస్సింగు టేబుల్సుని చూసినపుడు ఇవన్నీ నెమ్మదిగా ముందుముందు కొనుక్కుంటాం అని మమ్మల్ని మేము నమ్మించుకునేవాళ్ళం. సినిమా పోస్టర్లని కచూసి ఫలాని సినిమాకి వెళ్ళాలి అనుకునేవాళ్ళం. వెళ్ళలేక మళ్ళీ 'సెకండ్ రన్‌లో చూద్దాం' అని కోరికల్ని వాయిదా వేసేవాళ్ళం. అప్పుడప్పుడు ఇంటి దగ్గర్నుంచి పులిహోర, వేయించిన అటుకులు బజ్జీలు, పకోడీలు చేసి తీసుకెళ్ళి బీచ్చిలో కూచుని తినేవాళ్ళం. సముద్రంతో ఎంతోసేపు ఆడుకునేవాళ్ళం – ఆ రోజుల్లో నాకు పాటలొచ్చు. చిన్న చిన్న పాటలు పాడుకునే వాళ్ళం. డబ్బులేక పోవడం అనేది మాకు నిరుత్సాహాన్ని కలిగించినా – జీవితానందాల్ని దూరం చేసుకోలేదు. అందుక్కారణం మాకున్న చిన్న చిన్న సరదాలే.

పెళ్ళయిన కొత్తలో చిన్న చిన్న కోరికల్ని కూడా చంపుకోవాల్సివచ్చేది, ఏవన్నా కొనుక్కోవాలంటే ఒక్క రూపాయి కనిపించేది కాదు. మంచి రోజులు ముందున్నవి నందనందనా అని పాడుకుని సంతోషించాల్సి వచ్చేది.

మా మావయ్యగారు గొప్ప పరోపకార స్వభావులు. ఆ రోజుల్లో రేషనింగ్ వుండేది. బియ్యాలు, గోధుమలకీ కటకట–ఎవరడిగితే వారికి ఇంట్లో వస్తువులిచ్చి అడగని వారిది పాపం సహాయాలు చేసేవారు. తనకు మాలిన ధర్మం అంటారే అలా ఇంట్లో వున్నది ఇచ్చేసేవారు. సరే – మంచిదే, వూళ్ళోకి ఎవరొచ్చినా ఇంటికి భోజనానికి పిలిచేసేవారు. వాళ్ళు వూళ్ళో వున్నంత కాలం ఇక్కడే తిష్టవేసేవారు. పడకలు, భోయినాలు, స్నానాలు, కాఫీ, టిఫిన్లు–ఉపన్యాసాలు, పద్యాలు, పాటలు, గోష్ఠులతో మా ఇల్లు పెళ్ళివారిల్లులా కలకల్లాడిపోయేది.

ఈ ప్రపంచానికి అట్టడుగున మరో ప్రపంచం వుండేది. అందులో అత్తయ్య, మా ఆడబడుచులు – పిల్లలం మేవూ – మా పెద్ద ఆడబడుచుకి కాపరానికి పంపించకుండా

టి.బి. వచ్చింది. ఆవిడ కోసం కె.జి.హెచ్‌కి రానూ పోనూ - ఆసుపత్రిలో మూడునాలుగేళ్ళు వుంది - సాటి రోగులు ఒక్కొక్కరూ పిట్టల్లా రాలిపోతూవుండేవారు. అన్ని ఆకులూ రాలాక చివరి ఆకులాగ మా ఆడబడుచు వుండేది. అందరికీ సరిపడే బట్టలు అవీ వుండే అవకాశం ఏదీ? గొయ్యి తవ్వడం, పూడ్చడం- చేతికందిన మేరా మావయ్యగారు అప్పులు చేస్తూ, తీరుస్తూ నలిగిపోతూ వుండేవారు. అలాటి సుడిగుండంలోకి కాపురానికెళ్ళి పాదం పెట్టాను - పెద్ద పళ్ళచక్రం తిరుగుతూంటే దాని కింద మేవంతా చెరుకు కర్రల్లా నలిగిపోతూ వుండేవాళ్ళం. సంసారం అంతా ఒక్క చేతిమీద సాగేది. అడ్వాన్సులూ, లోన్లూ - టియ్యే బిల్లులూ యిలా మూలిగే నక్క మీద తాటిపండులా వచ్చిపడింది - మా మావయ్యగారికి పక్షవాతం.

మా వారికి ఉద్యోగం లేదు. వస్తే బాగుండ్ను అనుకుంటూ వుండగా రైల్వే నుంచి కాల్‌లెటర్ వచ్చింది. ఇంట్లో ఎర్రని ఏగానీ లేదు. ఏం చేస్తారని అడిగితే నాన్నగారు చూస్తార్లే అన్నారు మా వారు.

అప్పుడు మా మావయ్యగారు రిక్షాలో వెళ్ళి ఎక్కడికో ఏదోచేసి ఓ ఎనభై రూపాయిలు అప్పు పుట్టించుకొచ్చి మా వారి చేతిలో పెట్టారు.

ఆ రూపాయిలు నెత్తురు చిమ్ముతున్నాయి. తరువాత మా యింట్లో నాకు నా వెండిగ్లాసు కనిపించలేదు. మా చంటివాడితో ఆడుతూ వాళ్ళ తాతగారు నాకు వినిపించేలా 'వెండిగ్లాసు పోయింది. పోయిందమ్మా పోయింది' అన్నారు. కంచం కూడా పోయేదే - యీలోగా మా వారికి ఉద్యోగం వచ్చింది. ఛల్ మోహనరంగా అని లేచి ఎగిరిపోయాం.

# 'వాక్' విలాసమ్

రోజు తెల్లారగట్ల లేచి మార్నింగ్ వాక్‌కి వెళ్దాం వస్తావా అని మావారు అడిగారు. ఆడాళ్ళకి మాకు మార్నింగ్ వాకులు జోకులూ ఎందుకండీ - యీ గదిలోంచి ఆ గదిలోకి ఆ గదిలోంచి యీ గదిలోకి, వీధిలోంచి వంటింట్లోకి, వంటింట్లోంచి వీధిలోకి, డాబా ఎక్కీ దిగీ యీ ఎక్కడాలూ దిగడాలూ చాలవా మళ్ళీ ఆ తిరుగుళ్ళెందుకు - మీరు కావలిస్తే వెళ్ళండి. కుర్చీల్లో కూచుని పొట్ట పెంచుకునే వాళ్ళకు గాని మా ఫీమేల్సుకి వాకింగ్ గీకింగ్ జాంతానై - అక్కర్లేదు అన్నాను. మావారూరుకోలేదు - అలా పొద్దున్న కాస్సేపు వాకింగ్ చేస్తే 'ఫ్రెష్'గా తాజాగా వుంటుందిలే లేచి రమ్మన్నారు. మీ వాకింగ్ కో దండం మీకో దండం - యీవేసంగాలం కాస్త తెల్లార గట్లే చల్లగా వీస్తుంది - అప్పుడే కాస్త కునుకు పడ్తుంది - అలాటి నిద్ర కాస్తా పాడు చేసుకుని లెఫ్ట్ రైటు అంటూ డ్రిల్లు చెయ్యడానికి మనసొప్పదు - మీరెళ్ళి రండి - వెళ్ళి పొట్ట తగ్గించుకోండి అన్నా.